పాముకాటుతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని పకీరుకిత్తలి పంచాయతీ పరిధిలోని బూర్లిపేటకు చెందిన ద్వారపూడి మౌనిక (17) పాముకాటుతో మంగళవారం రాత్రి మృతి చెందింది. రాత్రి తన ఇంటి వద్ద పాము కాటేయడంతో తండ్రి రాము, కుటుంబ సభ్యులతో కలసి ఆమెను వెంటనే విజయనగరంలోని ప్రభుత్వాసుపత్రికి తలించారు. తనిఖీలు చేసిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మౌనిక మరణ వార్తతో గ్రామంలో విషాదం అలుముకుంది. మౌనిక నెల్లిమర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవలే పరీక్షలు రాసింది. గుర్ల ఎస్ఐ నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనం గుండెల్లో ఎలిఫెంట్ జోన్ కుంపటి

ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్లు ఉంది మన్యం జిల్లాలో ఏనుగుల వ్యవహారం. ఏనుగులను తరలించడంలో విఫలమైన ప్రభుత్వం, అటవీశాఖ.. జనం గుండెల్లో ఎలిఫెంట్ జోన్ కుంపటి పెడుతున్నాయి. ఏనుగుల కోసం ప్రత్యేకంగా జోన్ ఏర్పాటుకు పూనుకోవడమే అందుకు కారణం. అమ్మాదేవి కొండ వద్ద ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే పనులు ప్రారంభించాయి. అక్కడి భూములను సాగుచేసుకుంటూ జీవనం గడుపుతున్న రైతులను వెళ్లగొట్టేందుకు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా గ్రామస్తులు ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పాటై, ప్రజా సంఘాల ఆధ్వర్యాన పోరుబాట పట్టారు.

- భూములు పోతాయంటున్న ప్రజలు
- ట్రెంచ్ పనులు అడ్డుకున్న ఐక్యకార్యాచరణ కమిటీ
- ఏనుగులను జిల్లా నుంచి తరలించాలని డిమాండ్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో గత కొన్నేళ్లుగా అడవి ఏనుగుల గుంపు సంచారంతో ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు సంభవిస్తున్నాయి. కొమరాడ, కురుపాం, సీతంపేట, పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, తదితర మండలాల్లో ఇంతవరకు ఏనుగులు విధ్వంసాలకు పాల్పడ్డాయి. ఒడిశా నుంచి వచ్చిన ఏనుగులు పార్వతీపురం మన్యం జిల్లాని స్థావరంగా ఏర్పాటు చేసుకుని ఏజెన్సీ మండలాల ప్రజలను, గిరిజనులను హడలెత్తిస్తున్నాయి. ఏరోజు ఎటువైపు దారి తీస్తాయో తెలియని పరిస్థితుల్లో వాటి గమనాన్ని కనిపెట్టుకుంటూ అటవీ సిబ్బంది ఆ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి జిల్లాని వెంటాడుతున్న ఏనుగుల సమస్యకు పరిష్కారం చూపడంలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై బాధిత గ్రామాల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇంతవరకు ఏనుగుల దాడిలో 13 మంది మృతిచెందారు. లక్షలాది రూపాయల ఆస్తి, పంట నష్టం వాటిల్లింది. ప్రభుత్వం కూడా కొంతమేరకు ప్రాణ, ఆస్తి నష్టం జరిగిన కుటుంబాలకు నష్టపరిహారం పంపిణీ చేస్తోంది. చివరికి ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామంటూ అటవీశాఖ అధికారులు ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు చేయాలని చూస్తున్నారు. అమ్మాదేవి కొండ చుట్టూ ఏనుగుల కోసం ఓ జోన్ ఏర్పాటు చేయడానికి పనులు ప్రారంభించారు. దీనిలో భాగంగా కొద్దిరోజులుగా కొండ చుట్టూ జెసిబిలతో ట్రెంచ్ పనులు చేపడుతున్నారు.

భయం ముంగిట

సుమారు 1100 ఎకరాల్లో ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. ఇదే జరిగితే సీతానగరం మండలంలోని పలు గ్రామాల భూములు ఎలిఫెంట్ జోన్ పరిధిలోకి వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది. దీనివల్ల తమ జీవనాధారమైన భూములు, తోటలు కోల్పోతామని సీతానగరం మండలంలోని రేపటివలస, అప్పయ్యపేట, గుచ్చిమి, చిన్నరాయుడుపేట, తామరకండి, తానసీతారాంపురం గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుచేస్తే తమ పరిస్థితి ఏమిటోనన్న భయాందోళనకు గురవుతున్నారు.

ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు చేస్తామంటున్న కొండ

ఆందోళన బాట

ఎలిఫెంట్ జోన్ ఏర్పాటును అడ్డుకునేందుకు ఆయా గ్రామస్తులు, నాయకులు ఐక్యకార్యాచరణ కమిటీగా ఏర్పడి పోరుబాట పట్టారు. ప్రజాసంఘాల మద్దతుతో ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యాన బాధిత ప్రజలు ఆందోళనలకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా సోమవారం పార్వతీపురంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా, ర్యాలీ నిర్వహించారు. డిఎఫ్ఒ ప్రసూన, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు వల్ల ఎదురయ్యే ఇబ్బందుల గురించి వివరించారు. ఆ జోన్ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ట్రెంచ్ పనులు అడ్డగింత

ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుకు సంబంధించి జెసిబిలతో అటవీశాఖ అధికారులు ట్రెంచ్ పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న సమీప గ్రామాల ప్రజలు, ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు రైతు సంఘం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, సిఐటియు నాయకులు రెడ్డి వేణు ఆధ్వర్యాన మంగళవారం ట్రెంచ్ పనులు అడ్డుకున్నారు. జెసిబిలకు అడ్డంగా నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 13న అప్పయ్యపేట వద్ద పనులు చేస్తున్న యంత్రాలను అడ్డుకున్నారు. అటవీ అధికారులకు పనులు చేపట్టవద్దని, ఏమైనా పనులు చేపడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అయినా అటవీశాఖ అధికారులు మొండిగా ముందుకెళ్లడంపై ఆయా గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తమ బతుకులు బుగ్గిపాలు చేసే ఎలిఫెంట్ జోన్ పనులు నిలిపివేయాలని, లేకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని మహిళలు హెచ్చరించారు. ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించాలని కోరుతున్నారు.

అటవీశాఖ రేంజ్ అధికారి రామ్‌నరేష్‌తో చర్చిస్తున్న ఐక్యకార్యాచరణ కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు ఎం.కృష్ణమూర్తి, రెడ్డి వేణు, తదితరులు

అటవీశాఖ అధికారులతో చర్చలు

పార్వతీపురం : సీతానగరం మండలం గుచ్చిమి రిజర్వు ఫారెస్ట్ పరిధిలో ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుపై సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఐక్యకార్యాచరణ కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, అటవీ రేంజ్ అధికారి రామ్‌నరేష్ మధ్య చర్చలు జరిగాయి. ఎలిఫెంట్ జోన్ కోసం చేపడుతున్న ట్రెంచ్ పనులను మంగళవారం ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి స్థానికులు, రైతులు అడ్డుకున్నారు. దళితులు, గిరిజనులు, పేదలు సాగుచేస్తున్న భూములకు నష్టం జరుగుతుందనే ఆందోళన వ్యక్తం కావడంతో వారు ఎలిఫెంట్ జోన్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారు. పనులు అడ్డుకోవద్దని, గ్రామాల ప్రజలకు ఏమైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేస్తామని అటవీ అధికారులు చెప్పారు. దీంతో బుధవారం స్థానిక అటవీ రేంజ్ అధికారి కార్యాలయంలో ఇరువురి మధ్య చర్చలు నిర్వహించారు. భూములు సాగు చేస్తున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులూ ఉండబోవని అటవీ రేంజ్ అధికారి రామ్ నరేష్ చెప్పారు. ఆ విషయాన్ని గ్రామాల ప్రజల సమక్షంలో చెప్పాలని, వారు అంగీకరిస్తే అభ్యంతరం లేదని ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, సిఐటియు జిల్లా నాయకులు రెడ్డి వేణు, మండల నాయకులు రెడ్డి ఈశ్వరరావు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం మరోసారి సమీప గ్రామాల ప్రజల సమక్షంలో అటవీశాఖ అధికారులు, ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు చర్చలు జరపనున్నారు.

ట్రెంచ్‌ల పనులను అడ్డుకుంటున్న నాయకులు, బాధిత గ్రామాల ప్రజలు (ఫైల్)

జెడ్‌పి చైర్మన్‌కు పుత్ర వియోగం

పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

వైసిపి విజయనగరం జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన చిన్న కుమారుడు మజ్జి ప్రణీత్ (20) సుమారు ఐదేళ్లపాటు మృత్యువుతో పోరాడి బుధవారం మృతి చెందాడు. 2020 మే 4న విజయనగరంలోని ధర్మపురి రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అచేతన స్థితికి చేరుకున్నాడు. నాటి నుంచి మృత్యువుతో పోరాడిన ప్రణీత్ బుధవారం విశాఖపట్నంలోని స్టార్ పినాకిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. ప్రణీత్ మృతదేహాన్ని బుధవారం మధ్యాహ్నం ధర్మపురిలోని చిన్నశ్రీను స్వగృహానికి తీసుకువచ్చారు. తోటపాలెం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, చిన్న శ్రీను అభిమానులు అంత్యక్రియల్లో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. ఉత్తరాంధ్ర జిల్లాకు చెందిన వివిధ పార్టీల నాయకులు, అధికారులు, కార్యకర్తలు చిన్న శ్రీను కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల్లో ఉత్తరాంధ్ర వైసిపి సమన్వయకర్త కురసాల కన్నబాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పార్వతీపురం మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు పరీక్షిత్ రాజు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, మాజీ ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, బొత్స అప్పల నరసయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, అలజంగి జోగారావు, కంబాల జోగులు, బొడ్డేటి ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రణీత్

మాజీ సిఎం జగన్ పరామర్శ

చిన్న శ్రీను కుమారుడు ప్రణీత్ మరణం పట్ల మాజీ సిఎం, వైసిపి జాతీయ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఫోన్ ద్వారా చిన్న శ్రీనును పరామర్శించారు. కుమారుని మరణం పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జెడ్‌పి చైర్మన్‌ను పరామర్శించేందుకు వచ్చిన మాజీ ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు

ఉపాధి పనుల్లో అలసత్వం వద్దు

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

ఉపాధి హామీ ద్వారా జిల్లాలో చేపట్టిన పనుల్లో అలసత్వం వద్దని, వీలైనంత త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఉపాధి హామీ పనులపై కలెక్టర్ సంబంధిత అధికారులతో బుధవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీలో నిర్మిస్తున్న ప్రహరీగోడలు, మినీ గోకులాలు, ఇంకుడు గుంతలు, ఫార్మ్‌పండ్స్, ఫిష్ పాండ్స్, రహదారులు తదితర పనుల్లో మరింత ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఇప్పటివరకు అనుమతి పొందిన నిర్మాణాలన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

జిల్లాలో 334 ప్రహరీ గోడల నిర్మాణాలు మంజూరు చేశామని, వాటిలో 311 గ్రౌండింగ్ కాగా, అందులో 67 పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తికావాలని, భామిని, పాచిపెంట, సాలూరు, కురుపాం, పార్వతీపురం, సీతానగరం మండలాలు ప్రగతిని కనబరచాలని ఆదేశించారు. మినీ గోకులాలను 988 మంజూరుచేస్తే 894 గ్రౌండింగ్ అయ్యాయని, వాటిలో 113 పూర్తి చేశారని తెలిపారు. వీటిలో సాలూరు, పార్వతీపురం, భామిని, సీతంపేట, పాచిపెంట మండలాలు మినీ గోకులాల్లో పురోగతి ఉండాలని, అలసత్వం వహిస్తే సహించేది లేదని తెలిపారు. ఇంకుడు గుంతలు 7,342 పనులను అప్పగించగా 4,284 పనులు పూర్తిచేశారని చెప్పారు. మిగిలిన పనులు కూడా వీలైనంత త్వరగా చేపట్టాలన్నారు. ఫార్మ్ పండ్స్ నిర్మాణాల్లో 11,250 లక్ష్యం కాగా 7,986 మంజూరు చేశామని, వాటిలో 927 పూర్తిచేశారని వివరించారు.

సీతంపేట, సీతానగరం, గుమ్మలక్ష్మీపురం, వీరఘట్టం, సాలూరు, పాలకొండ, పాచిపెంట మండలాల్లోని పనుల్లో పురోగతి కనిపించడం లేదన్నారు. నిర్లక్ష్యం వహించకుండా ఇచ్చిన లక్ష్యాలను సాధించాలని తెలిపారు. గ్రౌండింగ్ కాని పనులు వెంటనే ప్రారంభించి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, చేపట్టిన పనులకు ఎప్పటికపుడు బిల్లులను అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు.

ఫిష్ పాండ్స్, రహదారి పనుల్లో ఇచ్చిన లక్ష్యాలను సాధించి ఉపాధి హామీలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఉపాధి కింద చేపట్టిన పనులకు బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, ఎంపిడిఒ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-విజయనగరం

బిసి కార్పొరేషన్ రుణాలకు ఈనెల 22వ తేదీలోగా పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బిసి రుణాలపై జిల్లా బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఛైర్‌పర్సన్ యశస్వి మాట్లాడుతూ, బిసిల్లో పేదలకు ఈ పథకం వరం లాంటిదని పేర్కొన్నారు. దాదాపు 145 రకాల యూనిట్లకు ప్రభుత్వం సబ్సిడీని, బ్యాంకుల నుంచి రుణాలను ఇప్పించడం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని యూనిట్లను స్థాపించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. ఈ రుణాల పట్ల నాయకులు, కార్యకర్తలు అర్హులకు అవగాహన కల్పించి, దరఖాస్తు చేయించాలని సూచించారు. దాతల సహకారంతో బిసి హాస్టళ్లను మరమ్మతు చేయించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బిసి కార్పొరేషన్ ఇడి పెంటోజీరావు , ఎబిసిడబ్ల్యూఒలు ఎం.యశోధనరావు, బి.రాజులమ్మ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ

ప్రజాశక్తి-సాలూరు రూరల్

వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ బివి ప్రసాద్ తెలిపారు. కాపు, బలిజ, ఒంటరి, పేద రెడ్డి, కమ్మ, వైశ్య, ఇబిసిలో బ్రాహ్మణ, క్షత్రియ మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణను 45 రోజుల పాటు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ నిర్వహిస్తుందని చెప్పారు. శిక్షణ అనంతరం ప్రతిఒక్కరికీ కుట్టు మిషన్లు అందజేస్తారని తెలిపారు. 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలు అర్హులని చెప్పారు. ఈ నెల 22వ తేదీలోగా అర్హులైన మహిళలు వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

400 హైరిస్క్ గ్రామాలు

పిహెచ్‌సిల్లో అందుబాటులో మందులు : డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో 400 హైరిస్క్ మలేరియా గ్రామాలను గుర్తించామని, ప్రస్తుతానికి జిల్లాలో మలేరియా కేసులు నమోదు లేవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. బుధవారం ఆయన గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో గత ఏడాది 400 వరకు మలేరియా కేసులు నమోదు అయ్యాయని, దానికి గాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా కిట్లను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేశామని అన్నారు. ఈ ఏడాది మలేరియా కేసులు పెద్దగా నమోదు కాలేదని అన్నారు. జిల్లాకు మూడున్నర లక్షల నుండి నాలుగు లక్షల వరకు దోమతెరలు తెప్పించేందుకు ప్రతిపాదనలు పంపించామని, వచ్చిన వెంటనే ఏజెన్సీలో పూర్తిస్థాయిలో పంపిణీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో మలేరియా పాజిటివ్ కేసులు కూడా లేవని అన్నారు. ఇప్పటివరకు ఏడాదిలో రెండుసార్లు గిరిజన గ్రామాల్లోనూ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో, వసతి గృహాల్లో ఎవల్ఒ ద్రావణాన్ని పిచికారి చేపడుతున్నామని, ఈ ఏడాది మూడుసార్లు పిచికారీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జూన్, జూలై నెలల్లో మలేరియా మాసోత్సవాలు నిర్వహిస్తుంటామని, ఆ సమయంలో దోమతెరలు పంపిణీ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. జిల్లాలో 16 మంది వైద్యులు ఉన్నత చదువులు చదివేందుకు వెళ్లారని, ఆ మేరకు ఆ పోస్టులు మరో మూడు నెలల్లో భర్తీ కానున్నాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం డైరెక్టర్ పి. జగన్మోహన్రావు, వైద్యులు దుర్గాప్రసాదరావు, రవికుమార్, అభిలాష్, డాక్టర్ రమ్య, డాక్టర్ త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

రోగులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

మొండెంఖల్ పిహెచ్‌సిలో తనిఖీలు

కురుపాం : మండలంలో మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఉన్న రికార్డులు, మందులు పరిశీలించారు. అనంతరం వైద్యాధికారి బి.ప్రజ్ఞతో మాట్లాడి, ఆస్పత్రిలో డెలివరీలపై ఆరాతీశారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రికి వచ్చిన రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందేటట్లు చూసి, వేసవికాలం నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ టి. జగన్‌మోహనరావు, హెల్త్ సూపర్వైజర్లు, ఎఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ

ప్రజాశక్తి-పాచిపెంట

ప్రభుత్వ స్థలాలు, డి-పట్టా భూములు ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని పార్వతీపురం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ హెచ్చరించారు. బుధవారం పాచిపెంట తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో వినతులు పరిష్కారంలో భాగంగా వచ్చినట్లు తెలిపారు. మోసూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల స్థలం ఆక్రమించి ఇల్లు నిర్మించారని, డి-పట్టా భూములు ఆక్రమించారని గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. దీనిపై రెవెన్యూ అధికారులతో ఆరాతీసి నివేదిక కోరినట్లు తెలిపారు. అనంతరం పద్మాపురం బాలుర సంక్షేమ ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట తహశీల్దార్ డి.రవి, ఆర్ఐ రమణ, సీనియర్ అసిస్టెంట్ పి.తిరుమలరావు, విఆర్ఒలు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ శ్రీవాత్సవ

వైద్యుల నిర్లక్ష్యం..
శిశువు మరణం

- విషాదంలో గిరిజన కుటుంబం
- ఆస్పత్రి వద్ద నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ శిశువు మృతి చెందింది. అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలం గుమ్మ గ్రామానికి చెందిన శాంతి ప్రసవం కోసం ఆస్పత్రిలో చేరింది. గర్భిణీగా ఉండగా గతంలో పలుమార్లు ఆమె భర్త అరుణ్ తో కలసి ఆస్పత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంది. స్కానింగ్ అవసరమంటే ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చేయించు కున్నారు. బుధవారం గర్భిణీకి కాన్పు చేస్తామని చెప్పడంతో ఆ కుటుంబం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండిపోయింది. ఇందులో భాగంగా ఆమెకు వైద్య పరీక్షలు చేసి తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని చెప్పడంతో సంతోషించారు. అయితే ఆ సంతోషం ఎంతోసేపు నిలవలేదు. శాంతికి కాన్పు చేస్తున్న సమయంలో ఆడబిడ్డ పుట్టి చనిపోయింది. ఈ విషయం వైద్యులు బాధిత కుటుంబానికి తెలిపారు. అయితే కాన్పుకు కొన్ని గంటల ముందు వరకు తల్లీ బిడ్డ బాగున్నారని చెప్పిన వైద్యులు కాన్పులో బిడ్డ చనిపోయిందని చెప్పడంతో ఆ గురిజన కుటుంబం ఆవేదంలో మునిగిపోయారు. కేవలం వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ చనిపోయిందని తండ్రి అరుణ్ కన్నీరుమున్నీరయ్యాడు. అనంతరం తన కుటుంబ సభ్యులతో కలిసి ఆసుపత్రి బయట బైఠాయించి నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై వైద్యాధికారి నీలను వివరణ కోరగా గర్భంలో ఉన్న శిశువు మెడకు పేగులు చుట్టుకోవడం వల్ల గుండె ఆగిపోయిందని, దానివల్ల శిశువు మృతి చెందిందని, వైద్యుల నిర్లక్ష్యం లేదని తెలిపారు.

అపరాల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో రైతుల నుంచి పెసలు, మినుములు కొనుగోలు చేసే నిమిత్తం మూడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ నడిపేన వెంకటేశ్వర రావు తెలిపారు. జామి మండలం విజినిగిరి, గంట్యాడలో రైతు సేవా కేంద్రం, గజపతినగరం పిఎసిఎస్‌లో ఈ కేంద్రాలను బుధవారం తెరిచినట్లు వెల్లడించారు. రైతులు తాము పండించే పెసలు, మినుములు వ్యవసాయ ఉత్పత్తులను పూర్తిగా శుభ్ర పరచి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందవచ్చని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాల మేరకు తమ ఉత్పత్తులు వుండేలా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. రబీ సీజన్ - 2024 సంవత్సరంలో పండించే పెసలు మినుములు మాత్రమే కొనుగోలు చేస్తామన్నారు. ఇ - క్రాప్ చేయించుకున్న రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను సిఎం - యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-వీరఘట్టం

ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద చేపడుతున్న గృహ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇఇ జి.రవి లబ్ధిదారులకు సూచించారు. బుధవారం మండలంలో కె.ఇచ్చాపురం గ్రామంలో పర్యటించి, గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. వీలైనంత త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా లక్ష రూపాయలు అందజేస్తున్నట్లు లబ్ధిదారులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, పంచాయతీరాజ్ జెఇ డి.కళ్యాణి దుర్గ, గృహనిర్మాణ శాఖ ఎఇ వి.వినోద్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎం.వసంత్ కుమార్ పాల్గొన్నారు.

సిటియులో వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, జర్నల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ సంయుక్తంగా కెమిస్ట్రీ విభాగం 'మాలిక్యూల్స్ టు మెటీరియల్స్' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు.కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్ అధ్యక్ష ప్రసంగం చేస్తూ, ఆవిష్కరణ, విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడంలో విశ్వవిద్యాలయం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. రసాయనిక శాస్త్రం ఉద్యోగ ఉపాధి అవకాశాలను ఎక్కువగా అందించే విభాగమని, నేడు మెటీరియల్ సైన్స్ పైనే ప్రపంచం ఆధార పడి ఉందని తెలిపారు. రాబోయే రోజులలో ఇది ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్, నానో టెక్నాలజీ లతో కలసి ప్రపంచాన్ని శాసించే విధంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ చీఫ్ ఎడిటర్, బెంగళూరు లోగల ఇండియన్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన ప్రొఫెసర్ ఎస్.నటరాజన్ ప్రొఫెసర్ బాలాజీ ఆర్. జాగీర్దార్, కెఆర్ ప్రసాద్ వంటి ప్రముఖులు అధునాతన పద్దతులలో తయారు చేసిన వివిధ పదార్థాలపై పరిశోదనాత్మక ఉపన్యాసాలు ఇచ్చారు. కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ ముక్కామల శరత్‌చంద్రబాబు, కోఆర్డినేటర్లు డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ పడాల కిషోర్‌లతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీ చిత్రలేఖనంపై శిక్షణ

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో పులిపుట్టి పంచాయతీ సుందరయ్యగూడ గ్రామంలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివాసీ చిత్రలేఖనం (ఇదిసింగ్) శిక్షణను మంగళ, బుధవారాల్లో నిర్వహించారు. ఈ శిక్షణకు 3 మండలాల నుంచి 25 మంది పాల్గొన్నారని కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు. రూపాయి గ్రామం నుంచి ఆరిక గోపాల్‌ను తీసుకున్నట్లు చెప్పారు. ఆదివాసీ చిత్రలేఖనం గొప్పదనం, విశిష్టత గురించి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు వెలుగు అసోసియేషన్ నుంచి బాణాల వెన్నెల, వసంత, మిన్నారావు, ఉమ లావణ్య, పార్వతి, శంకరరావు, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం నిర్మించాలని వినతి

ప్రజాశక్తి -వీరఘట్టం

అంబేద్కర్ జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహ పునర్నిర్మాణ పనులు చేపట్టాలని కెవిపిఎస్ నాయకులు ఎన్.సింహాచలం డిమాండ్ చేశారు. బుధవారం తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ప్రధాన రహదారి విస్తరణ పనులు పూర్తయి దాదాపుగా 9 నెలలు కావస్తున్నప్పటికీ ఇప్పటివరకు అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయలేదన్నారు. ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతికి విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు, సిబ్బంది అగ్నిప్రమాదాలపై బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రై కెమికల్ పౌడర్ ఫైర్ ఎక్టింగ్ విషర్ ఉపయోగించే పాస్ పద్ధతి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.చంద్రరావు, ఉపాధ్యాయులు సి.హెచ్ నల్లయ్య, ఎం.కామేశ్వరరావు, కె.ప్రసాద్‌రావు, ఎస్.మంగయ్య, గోవిందరావు, డిప్యూటీ వార్డెన్ రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండల పరిధిలోని పెదగుడబ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్త చింతాడ గౌరమ్మ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు.

అన్నప్రాసన చేయిస్తున్న తల్లి

మార్గదర్శకాలు పాటించాల్సిందే

ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలకు డిఎంహెచ్ఒ ఆదేశం

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-పార్వతీపురం

వైద్యారోగ్యశాఖ నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలను ప్రయివేటు ఆస్పత్రులు అమలు చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలోని ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశాన్ని బుధవారం స్థానిక ఎన్‌జిఒ హోం నిర్వహించారు. ఆస్పత్రులలో నిర్వహించిన ప్రతీ ప్రసవానికి సంబంధించిన పూర్తి వివరాలు హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రసవం తర్వాత జనన ధ్రువపత్రాన్ని వారికి అందజేయాలన్నారు. కాన్పుల వివరాల నమోదు రికార్డు.. పార్చురిషన్ రిజిస్టర్ అన్ని ప్రయివేటు ఆస్పత్రుల్లో ఒకే విధంగా ఉండేటట్లు చూసుకోవాలని తెలిపారు. ఎన్ని సాధారణ, సీజేరియన్ డెలివరీలు నిర్వహించారో ఆస్పత్రుల వారీగా రికార్డుల్లో పరిశీలించారు. సీజేరియన్ డెలివరీ నిర్వహణకు తగు కారణాలు ఉండాలని స్పష్టంచేశారు. శస్త్ర చికిత్స సమయంలో అనస్థీషియా వైద్యులు అందుబాటులో తప్పనిసరిగా ఉండాలన్నారు. స్కానింగ్ నిర్వాహకులు పిసి అండ్ పిఎన్‌డిటి యాక్ట్ కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అందుకు సంబంధించి నిర్దేశించిన కొలతలు ఉన్న పోస్టర్‌ను అక్కడ ప్రదర్శించాలన్నారు. ఆరోగ్య పరీక్షల రుసుం వివరాలు ఆస్పత్రిలో ప్రదర్శించాలని సూచించారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. డెంగీ జ్వర తుది నిర్ధారణ నిర్దేశించిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రమే చేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు టి.జగన్మోహనరావు, పిఎల్. రఘుకుమార్, ఐఎంఎ ప్రెసిడెంట్ యాళ్ల వివేక్, డిఎస్ఒ శంకర్, డెమోలు యోగీశ్వరరెడ్డి, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో నీలకంఠపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ, ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. డాక్టర్ డి.శ్రీనివాసరావు 123 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డెన్ పి.మల్లేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంటిపేటలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని అంటిపేట గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఆయన రైతులతో మాట్లాడుతూ నవధాన్యాలు, తృణధాన్యాలు సాగు పెంచాలన్నారు. దీనివల్ల నేల సారం పెరగడంతోపాటు రైతుకు లాభం చేకూరుతుందని సూచించారు. కార్యక్రమంలో విఎఎ, రైతులు పాల్గొన్నారు.

48 మంది గైర్హాజరు

సీతంపేట.. పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పార్వతీపురం మన్యం జిల్లాలో బుధవారం జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు 48 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 67 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 10,367 మందికి గాను 10,319 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎక్కడా మాస్ కాపీయింగ్, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు డిఇఒ డి.వెంకటనాయుడు తెలిపారు.

పరీక్షా కేంద్రం పరిశీలన

సీతంపేట : సీతంపేట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు. ధోనుబాయి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సీతంపేట ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ కె.రవి ప్రసన్నకుమార్ సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు.

కురుపాం : కురుపాంలో ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద బుధవారం పదో తరగతి హిందీ పరీక్ష సందర్భంగా ఎస్ఐ పి.నారాయణరావు తన సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు, మాల్ ప్రాక్టీస్ జరక్కుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

29న ఐటిడిఎ వద్ద ధర్నా

ప్రజాశక్తి-సాలూరు రూరల్

గిరిజనుల పంటలకు మద్దతుధర ప్రకటించి, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఈ నెల 29న పార్వతీపురం ఐటిడిఎ వద్ద ధర్నా చేపడుతున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం సాలూరులోని సిఐటియు కార్యాలయంలో ధర్నా వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు మద్దతు ధర ప్రకటించక పోవడం, కొనుగోలు చేయకపోవడంతో దళారులకు విక్రయించాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

జీడి పంటకు కనీస మద్దతు ధర కిలోకు రూ.200 ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 29న చేపట్టే ధర్నాకు గిరిజనులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గెమ్మెల జానకిరావు, జిల్లా కమిటీ సభ్యులు మంచాల శ్రీనివాసరావు, సోముల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన

ఆయిల్ పామ్ తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త శ్రీనివాసరాజు

ప్రజాశక్తి-మక్కువ

ఉద్యాన పంటల్లో చీడపీడల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. బుధవారం మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ పరిధిలో రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం పరిశోధన శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరాజు ఆయిల్‌పామ్ తోటలో యాజమాన్య పద్ధతులను ఏ విధంగా చేస్తున్నారో రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు యాజమాన్య పద్ధతులపై పలు సూచనలు సలహాలను చేశారు. ప్రతి రైతు తప్పనిసరిగా 2.6 కేజీల నత్రజని, 3.7 కేజీల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ను, 2 నుండి 4 ఎంఒపిని ప్రతి ఆయిల్‌పామ్ మొక్కకు సంవత్సర కాలంలో అందించాలని ఆయన సూచించారు. మొక్కలకు వచ్చే పలు చీడపీడలు ఏ విధంగా నివారించుకోవాలో సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి ప్రత్యూష భాను, విహెచ్ఎ సత్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ గ్యాస్ ఆఫీసు వద్ద నిరసన తెలుపుతున్న పిపిఎస్ఎస్ నాయకులు, గ్యాస్ లబ్ధిదారులు

భారత్ గ్యాస్ ఆఫీసు తెరిపించాలని నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలోని సారికవీధిలో మూడు వారాలుగా మూతబడిన భారత్ గ్యాస్ ఆఫీసు తెరిపించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు డిమాండ్. చేశారు. బుధవారం గ్యాస్ లబ్ధిదారులతో కలిసి భారత్ గ్యాస్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం పట్టణ, సుదూర ప్రాంతాల లబ్ధిదారులు సుమారు 800 మంది గత 25 రోజులుగా ఇండెంట్లు పెట్టినా, నేటికీ సిలిండర్లు సరఫరా చేయడం లేదన్నారు. భారత్ గ్యాస్ ఏజెన్సీ ఆఫీసు మూడు వారాలుగా తెరవడం లేదని చెప్పారు. ఆఫీసు ఫోన్లు పని చేయకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అనంతరం తహశీల్దార్ జయలక్ష్మికి సమస్యను వివరించారు. అనంతరం సివిల్ సప్లై ఉపతహశీల్దారుతో ఫోన్లో మాట్లాడారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంచాన ఉమామహేశ్వరరావు, బంకురు సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-సీతంపేట

ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఐటిడిఎ పిఒ, ఐసిడిఎస్ పీడీ, అధికారులు

పిఎం జన్‌మన్ పథకం కింద సీతంపేట, భామిని మండలాలకు నూతనంగా మంజూరైన మూడు అంగన్వాడీ కేంద్రాలలో హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఇంటర్వ్యూలు నిర్వహించారు. సీతంపేట మండలంలోని రేగులగూడ, దిగువ బుడగరాయి అంగన్వాడీ కేంద్రాల్లో రెండు హెల్పర్ పోస్టులకు ముగ్గురు అభ్యర్థులు హాజరయ్యారు. భామిని మండలంలో మాసగూడ అంగన్వాడీ కేంద్రంలోని హెల్పర్ పోస్టుకు ఇద్దరు అభ్యర్థులు హాజరయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు తర్వాత సమాచారం అందిస్తామని పిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, కుసిమి పిహెచ్‌సి వైద్యాధికారి శివశంకర్ చాందిని, సిడిపిఒలు పి.రంగలక్ష్మి, శాంతి భవాని, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లకు చర్యలు

ప్రజాశక్తి-వీరఘట్టం

సిబ్బందితో మాట్లాడుతున్న డివిజనల్ అధికారి రాంప్రసాదరావు

డివిజన్ పరిధిలో బకాయి ఉన్న ఇంటి పన్ను వసూళ్లను ఈ నెలాఖరికి పూర్తి చేసేందుకు ముమ్మర చర్యలు తీసుకుంటున్నట్లు డివిజనల్ పంచాయతీ అధికారి జె.రాంప్రసాదరావు తెలిపారు. బుధవారం మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన.. అనంతరం విలేకరులతో మాట్లాడారు. డివిజన్‌లో రూ.1.76 కోట్ల పైచిలుకు బకాయి ఉందని, ఇంతవరకు రూ.1.34 కోట్లు వసూలు చేశారని తెలిపారు. మిగిలిన బకాయిని ఈ నెలాఖరికి వసూలు చేసి, లక్ష్యాలను అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వీరఘట్టం మేజర్ పంచాయతీకి సంబంధించి రూ.42 లక్షల బకాయి ఉందన్నారు. రూ.27 లక్షలు వసూలు చేసినట్లు చెప్పారు. రూ.15 లక్షలు వసూలు చేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రమణమూర్తి నాయుడు, ఇన్‌ఛార్జి ఇఒ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న లెక్చరర్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి

ప్రజాశక్తి - సీతానగరం

విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరాలని లెక్చరర్లు డి.రామకృష్ణ, డి.శివకుమార్ కోరారు. మండలంలో బూర్జ పదో తరగతి పరీక్ష కేంద్రం వద్ద పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలపై అవగాహన కల్పించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కళాశాలలో చేరితే అన్ని రకాల మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంటాయని, ప్రభుత్వ పథకాలు వస్తాయని తెలిపారు.

భవన నిర్మాణం పరిశీలన

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కె.ఇచ్చాపురం గ్రామంలో రూ.32 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న పంచాయతీ భవన నిర్మాణ పనులను బుధవారం ఎంపిడిఒ బి.వెంకటరమణ పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో పాటు సర్పంచ్ బి.గౌరునాయుడు, పంచాయతీ కార్యదర్శి ఎం.వసంత్ కుమార్, కరణం ఉమామహేశ్వరరావు ఉన్నారు.

పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ వెంకటరమణ

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో కొత్తవలసలో ఉన్న ఏడో వార్డు నందమూరి కాలనీలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. అక్కడి కాలువల నుంచి మురుగునీరు వెళ్లేందుకు దారి లేక తీవ్రదుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికుల నుంచి సమాచారం రావడంతో బుధవారం మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పకీర్‌రాజు పర్యవేక్షణలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు తొలగించారు. అనంతరం కాలువల్లో యాంటీ లార్వా ద్రావణాన్ని పిచికారీ చేశారు. ఫాగింగ్ మిషన్‌తో దోమల నివారణ చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పనులను పర్యవేక్షిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

అందజేసిన ప్లేట్లు, గ్లాసులతో విద్యార్థులు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు వసంత లక్ష్మి, హెచ్‌డబ్ల్యుఒ పాలక అమల ప్లేట్లు, గ్లాసులు, కూర గిన్నెలు బుధవారం పంపిణీ చేశారు. 647 మందికి విద్యార్థినులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.